



చిన్నారి పెళ్లి కూతుళ్లు

- జిల్లాలో 13 బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు
- అవగాహన కల్పిస్తున్నా ఆగని దురాచారం
- బాల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు

బడిలో బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన పుత్తడి బొమ్మలకు మూడుముళ్ల బంధనాలు వేసి వారి భవితను ఎండవావిగా మార్చుతున్నారు. తల్లిదండ్రుల ఆర్థిక సమస్యలు, అవగాహనలోపం, నిరక్షరాస్యత బాల్య వివాహాలకు కారణమవుతున్నాయి.

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల గ్రామాల్లో వివిధ కారణాలతో బాల్యవివాహాలు జరుగుతున్నాయి. కేవలం అవగాహన లోపం, అనాలోచిత నిర్ణయాలతో పెళ్లిళ్లు చేస్తున్నట్టు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. హాయిగా తోటి విద్యార్థులతో చదువుకోవాల్సిన వయస్సులో మూడుముళ్ల బంధంతో భవితకు అడ్డుకట్ట వేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొచ్చినా జిల్లాలో ఎక్కడో ఓ చోట వెలుగు చూస్తునే ఉన్నాయి. తమ పిల్లలకు మంచి సంబంధం చూసి మూడుముళ్లు వేయించి తమ బాధ్యత తీర్చుకోవాలని తల్లిదండ్రులు భావిస్తుంటారు. ఇదే క్రమంలో తొందరపడి వివాహం చేస్తున్నారు. ఎక్కువగా అమ్మాయిల విషయంలోనే వివాహాలు జరుగడంతో భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు అధికంగా వస్తున్నాయని వైద్యు లు హెచ్చరిస్తున్నారు. వీటిని నియంత్రించాలని అధికారులు చెబుతున్నారు.

● పుట్టబోయే బిడ్డకు..

బాల్య వివాహాలు చేయడం వల్ల ఆరోగ్య పరంగా తల్లికి పుట్టబోయే బిడ్డకు ఎంతో నష్టమని వైద్య నిపుణులు ఒకవైపు చెబుతునే ఉన్నారు. మరో వైపు కొన్ని చోట్ల బాల్య వివాహాలనే కొన సాగిస్తున్న నేపథ్యంలో సమగ్ర శిశు సంరక్షణ శాఖ వీటికి అ డ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. సమాచారం మేరకు పెళ్లిళ్లను నిలిపివేస్తున్నారు. వధూవరుల కుటుంబాలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఏళ్లుగా సభలు, సమావేశాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక అవగాహన సదస్సుల్లో స్వచ్ఛంద సంస్థలు బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని చెబుతున్నా జరిగే అనర్థాలు మాత్రం ఆగడంలేదు. అడపిల్లే కదా తొందరగా పెళ్లి చేస్తే ఓ పనై పోతుందని కొందరు ఆలోచిస్తూ పెళ్లిళ్లు జరిపిస్తు న్నారు. ప్రస్తుతం శ్రావణమాసం కావడంతో జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో బాల్యవివాహాలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్న ట్లు అధికారులకు సమాచారం రావడంతో వాటిని అడ్డుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సంక్షే మశాఖ పరిధిలోని ఉన్నతాధికారులు, అంగన్ వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ ఉద్యోగులు గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగ కుండా దృష్టి సారిస్తున్నారుజ

● మూడేళ్లుగా..

జిల్లాలో మూడేళ్లుగా ఆయా మండలాల్లో అవగాహాన సదస్సులు నిర్వహించడంతో పాటు బాల్య వివాహాలను అడ్డుకున్న సంఘటనలు చోటు చేసుకున్నాయి. జిల్లాలో 2023లో 18, 2024లో 15, 2025లో ఇప్పటి వరకు 13 బాల్య వివాహలను అధికారులు అడ్డుకున్నారు. మూడేళ్ల కాలంలో జిల్లా వ్యాప్తంగా 300లకు పైగా అవగాహన సదస్సులు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల తలెత్తే అనార్థాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కాగా బాల్య వివాహాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం గతేడాది ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181, 100లతో పాటు సమీప ప్రాంతంలో పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేయ వచ్చు. సమాచారం అందిన వెంటనే అదికారులు అక్కడికి చేరుకొని బాల్య వివాహలను అడ్డుకుని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం
- బూర్ల మహేష్, డీసీపీవో, ఆసిఫాబాద్



జిల్లాలో బాల్యవివాహాలను అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. బాల్య వివాహల మూలంగా ఏర్పడే అనర్థాలతో పాటు కేసులు వివరాలతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. బాల్య వివాహాల సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచు తాం. బాల్య వివాహాలు కొనసాగకుండా సహకారం అందించాలి.

రెండో రోజుకు చేరిన ఎమ్మెల్యే దీక్ష



దీక్షలో కూర్చున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పోడు సమస్యను పరిష్కరించాలని, జీవో 49ని శాశ్వతంగా రద్దు చేయాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు తన నివాసంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిర్పూరు నియోజకవర్గంలో వివిధ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు వచ్చి మద్దతు పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతుల విషయంలో స్పష్టత ఇవ్వడం లేదన్నారు. జీవో 49 కేవలం తాత్కాలికంగా కాకుండా పూర్తిగా రద్దు చేశామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిర్పూరు నియోజకవర్గంలో అటవీ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరుగడం లేదన్నారు. మంత్రి సీతక్క ఏరియాలో అటవీ ప్రాంతంలో అభివృద్ధి పనులకు అనుమతి ఇచ్చారని అన్నారు. తమ ప్రాంతానికి మాత్రం ఇంత వరకు అనుమ తులు రాలేదన్నారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని తెలిపారు. నిరవధిక దీక్ష శిబిరాన్ని ఆసిఫాబాద్ మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు కార్యకర్తలు సందర్శించి మద్దతు పలికారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఆర్మీశివకుమార్, మాజీ కౌన్సిలర్ సిందం శ్రీనివాస్, ఆశోక్, చన్నపురి గణపతి, సాంబయ్య, బాల్కు-శ్యాం, పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ ప్రేంకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. ఉదయం, సాయంత్రం వైద్యులు డాక్టర్ హరీష్ బాబు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.

స్పీకర్‌కు లేఖ రాసిన ఎమ్మెల్యే

పోడు సమస్య విషయంలో న్యాయం చేయాలని మంగళవారం శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఎమ్మెల్యే హరీష్‌బాబు లేఖ రాశారు. సిర్పూరు నియోకవర్గంలో పోడు పరిస్థితిని, అటవీ శాఖ అధికారుల వేధింపులు తదితర అంశాలను ప్రస్తావిస్తూ తాను నిరవధిక దీక్ష చేపడుతున్నట్టు ఆ లేఖలో వివరించారు.

విద్యారంగ అభివృద్ధికి చర్యలు



ఆదర్శ పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలను మంగళవారం సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, ప్రయోగశాల, వంట శాల, పారిశుధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సకల సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందిస్తున్నందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, శుద్ధమైన తాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వర్చువల్ రియాలిటీ పద్ధతిలో విద్యార్థులకు బోధించాలని తెలిపారు. పాఠశాలలో చేయాల్సిన మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం జన్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శిం చి రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని భవిత కేంద్రాన్ని సందర్శించి రికార్డుల పరిశీలన, విద్యార్థుల నమోదు వివరాలతో పాటు నూతనంగా నిర్మిస్తున్న భవిత కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత కేంద్రం ద్వారా విద్యాబోధన కొనసాగు తుందని అన్నారు. నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరిగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల హాజరుపై ఉపాధ్యాయులు, ఎంఈవోలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో విద్యార్థుల హాజరుపై మంగళవారం ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పాఠశాలల వారీగా సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల హాజరుపై అధికారులు ప్రతి రోజు పర్యవేక్షించాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే ఉపాధ్యాయులు విధుల పట్ల సమయ పాలన పాటించాలని, ఫేస్ రిజిస్ట్రేషన్ సిస్టం ప్రకారం నమోదు చేసుకోవాలని, చెప్పారు. సెలవుపై వెళ్లే ఉపాధ్యాయులు ముందుగా అనుమతి పొందాలని తెలిపారు. విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మెనూ ప్రకారం సకాలంలో అందించాలని సూచించారు. విద్యార్థులు ఇబ్బందులు పడొద్దని తెలిపారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

దహెగాం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు చేరిన పంటలను తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఏవో వంశీకృష్ణలు మంగళవారం క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. అయినం, పెసరికుంట, బీబ్రా, బోర్లకుంట, రాళ్లగూడ గ్రామాల్లో రైతులకు నష్ట సంభవించి పంటలను క్షేత్రస్థాఇలో పరిశీలించారు. ప్రాథమికంగా ఏ స్థాయిలో పంటలకు నష్టం సంభవించిందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఏవోలు వంశీ, సుస్మీత, రోహిణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాండ్‌గాం, వీరవెల్లి, పార్డి, తాటిపల్లి, బాలేపల్లి, మొగడ్‌దగడ్, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి ప్రాణహిత పరిసర ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలను ఏవో ప్రేమలత పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఆమె వెంట ఏఈవోలు ఘన్ శ్యాం, కవిత, కల్పన, తదితరులు ఉన్నారు.

పంటల సర్వే చేపట్టాలి

సిర్పూర్(టి), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెన్‌గంగా బ్యాక్ వాటర్‌తో నష్ట పోయినపంటలపై సర్వే చేయించాలని సీపీఎం నాయకులు ఆనంద్, శ్రీనివాస్, మల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపూర్, టోంకిని, పారిగాం, తదితర గ్రామాల్లో పంటలను పరిశీలించారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు, పురుగుల మందులను అధిక ధరలకు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీ శ్రీనివాస ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రిజిస్టర్లను, ఈ -పాస్ యంత్రం, ధరల పట్టిక, స్టాక్ నిలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అడిగిన మందులను నిర్ణీత ధరలకు మాత్రమే విక్రయించాలని అదనంగా మందులు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు చేసిన అంశాలను సంబంధించిన రైతులకు నగదు రసీదును అందించాలని తెలిపారు. జిల్లాలో యూరియా నిలువలు సమృద్ధిగా ఉన్నాయని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు వ్యవసా యాధికారులు అందించే సూచనలు పాటిస్తూ పంట మెలకువలు తెలుసుకుని యూరియా, ఇతర మందులను మోతాదు ప్రకారం పిచికారి చేయాలని చెప్పారు. అధిక దిగుబడి పొందాలని తెలిపారు. మందులను మోతాదుకు మించి వినియోగించకూడదని మందులు కొనుగోలు చేసిన రసీదులను రైతులు జాగ్రత్తగా భద్రత పర్చుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం యూరియా విత్తనాలు, మందులను సాగుకు అనుకూలంగా పంపిణీ చేస్తుందని, రైతులు అవకాశాన్ని వినియోగించుకుని పంట సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం ఏడీఏ మిలింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాసకులకు సన్మానం

వాంకిడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బౌద్ధ ఆచార్య ధమ్మ ప్రచారక్ శిక్షణ తీసుకున్న ఉపాసకులు మహోల్‌కార్ అశోక్, దుర్గం శ్యాం రావు, జాడే పాండుజీను మంగళవారం స్థానిక జైత్వాన్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్‌కార్ అశోక్ మాట్లాడుతూ బుద్ధుడి మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించేలా జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ధమ్మ ప్రచారం చేసేందుకు ఉపాసకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గం దుర్గాజీ, జైరాం, రోషన్, మనోజ్, ప్రతాప్, అన్నారావు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

జింకను కాపాడిన యువకులు

సిర్పూర్(టి), ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): హుడ్కిలి గ్రామా నికి చెందిన యువకులు కిర్మరే తరుణ్ కుక్కల బారి నుంచి జింకను కాపాడారు. జింకను మంగళవారం కుక్కల గుంపు తరుమ డంతో హుడ్కిలి గ్రామంలోకి వచ్చింది. తరుణ్ అనే యువకుడు కుక్కలను తరిమివేసి పరిశీలించగా జింకుకు గాయాలు కావడంతో అధికారులకు తెలియజేశాడు. ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్వో ప్రవీణ్ కుమార్ ప్రథమ చికిత్స చేసి అడవిలో వదిలేశారు.

పెన్‌గంగాకు తగ్గిన వరద ఉధృతి

సిర్పూర్(టి), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పెన్‌గంగా నదికి మంగళవారం వరద ఉధృతి తగ్గింది. సిర్పూర్(టి) మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పెన్‌గంగా ఉధృతంగా ప్రవహించింది. మంగళవారం వర్షాలు తగ్గుముఖం పట్టటడంతో వరద తగ్గింది.

ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం తనిఖీ

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాన్ని మంగళవారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రఘురాం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంతకు ముందు డిప్యూటీ కమిషనర్‌ను డీపీఈవో సిబ్బంది పూల మొక్కను అందజేశారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రేను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జ్యోతి కిరణ్, సీఐలు రవికుమార్, రమేశ్ పాల్గొన్నారు.

ఆరోపణలు సరికాదు

వాంకిడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని బీజేపీ నాయకులు నిరాధారమైన ఆరోపణల చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక బీజేవైఎం నాయకుడి ఆరోపణలను ఖండిస్తున్నామని తెలిపారు. సమావేశంలో మెంగాజీ, పెంటయ్య, కృష్ణ, మల్లయ్య, సోము, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

వాంకిడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఖం డిస్తున్నామని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో డబ్బులు తీసుకుంటున్నారని మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు తెలపడంతో పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు.

పొలాల అమావాస్య సందడి



వాంకిడిలో ఏర్పాటు చేసిన పశువుల అలంకరణ సామగ్రి దుకాణాలు

వాంకిడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం పొలాల అమావాస్య సందడి నెలకొంది. ఏటా మండలంలో పొలాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహిస్తారు. పొలాల అమావాస్య రోజున ఎద్దులను ఉదయమే శుభ్రంగా కడిగి వాటిని అలంకరించి సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహి స్తారు. పొలాల పండుగను శనివారం నిర్వహించేం దుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. పొలాల అమవాస్య పండుగకు మూడు రోజులు మాత్రమే ఉండడంతో వ్యాపారులు ప్రత్యకంగా ఎద్దుల అలం కరణల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎడ్ల జతలకు అలంకరించే జూలు, గజ్జెలు, ముక్కుతాళ్లు, కొమ్ములకు అలంకరించే రంగులను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. ఎద్దుల అలంకరణ సామగ్రిని కొనుగోలు చేసేందుకు గ్రామస్థులు మండల కేంద్రానికి తరలి వచ్చారు. దీంతో మండల కేంద్రంలో ఎద్దుల అలంక రణల దుకాణాలు, కిరాణా దుకాణాలు రైతులతో కిటకిటలాడాయి.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

కెరమెరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖైరి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంద్రానగర్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కోతకు గురికాగా మంగళవారం ఎంపీడీవో అంజద్‌పాషా రోడ్డును పరిశీలించారు. కోతకు గురైన ప్రాంతంలో గ్రామ పంచాయతీ సిబ్బందితో బండరాళ్లను గుంత ప్రాంతంలో ఏర్పాటు చేయించారు. అలాగే ట్రాక్టర్ ద్వారా మట్టి తెప్పించి గుంతలను పూడ్చారు. ఈ రోడ్డు మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగించకూడదని చాటింపు వేయించారు. అనంతరం తహసీల్దార్ భూమేశ్వర్, ఎస్సై మధుకర్‌లు సైతం కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతుండడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని అధికారులు తెలిపారు. అధికారుల వెంట కార్యదర్శి శ్వేత తదితరులు ఉన్నారు.

యూరియా కోసం పడిగాపులు



సిర్పూర్(టి)లో యూరియా కోసం క్యూలైన్లలో వేచి ఉన్న రైతులు

పెంచికలపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఎదుట మంగళవారం ఉదయం 8 గంటల నుంచి యూరియా కోసం రైతులు బారులు తీరారు. 11 గంటల వరకు వ్యవసాయాధికారులు రాక పోవడంతో యూరియా కోసం రైతులకు నిరీక్షణ తప్పలేదు. అనంతరం ఏఈవో శ్రీవిద్య అక్కడికి చేరుకుని 440 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దాదాపు 800 బస్తాలకు రైతులకు టోకెన్లు అందజేశారు. కొంత మంది రైతులకు యూరియా అందింది. మిగితా రైతులకు టోకెన్లు అందినా యూరియా అందలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా యూరియా అందడం లేదని, సరిపడా యూరియా అందజేయాలని రైతులు కోరుతున్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు రెండు చొప్పున బస్తాలను సీఈవో రాకేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అలాగే మిగిలిన వారికి కూడా ప్రభుత్వం నుంచి వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

కాలిన గృహోపకరణాలు

కాగజ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ విజయబస్తీలో మంగళవారం హైవోల్టేజీ విద్యుత్ ప్రసారం కావడంతో ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్లు, విద్యుత్ సాకెట్లు కాలిపోయాయి. పట్టణ ఎంఐఎం అధ్యక్షుడు మోబీన్ ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ట్రాన్స్‌కో అధికారులు విచారణ చేపట్టారు. పలువురు కాలనీవాసులు తమకు పరిహారం అందించాలని అధికారులను కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నెన్నెల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నెన్నెల కుమ్మరివాగు నుంచి బెల్లంపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు చెప్పారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్ ఓనర్ గోలెం తిరుపతిపై కేసు నమోదు చేశామన్నారు. మండలం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

టీఎల్ఎం మేళాను సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(టి), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీఎల్ఎం మేళాను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వేణుగోపాల్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహంలో మంగళవారం నిర్వహించిన టీఎల్ఎం మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో నిర్వహించిన మేళాను మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొని ప్రజెంటేషన్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.



కాగజ్‌నగర్‌లోని నవోదయ విద్యాలయం

నవోదయ ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఈ నెల 27 వరకు దరఖాస్తులకు అవకాశం
డిసెంబర్ 13న రాత పరీక్ష

రిజర్వేషన్లు ఇలా..

విద్యాలయంలో 80 సీట్లలో 75 శాతం అంటే (60 సీట్లు) గ్రామీణ ప్రాంతం విద్యార్థులకు, 25 శాతం అంటే (20 సీట్లు) ఓపెన్ కోటా కింద కేటాయిస్తారు. అందులో 15 శాతం ఎస్సీ, 7.5 శాతం ఎస్టీ, 3 శాతం దివ్యాంగులు, బాలికలకు 1/3 వంతు రిజర్వేషన్ ఉంటుంది. ఆరోతరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా విద్యా బోధనతో పాటు కంప్యూటర్ విద్య, క్రీడలు, ల్యాబ్, లైబ్రరీ సౌకర్యం ఉంటుంది. అన్ని సౌకర్యాలు, సదుపాయాలు ఉండడంతో ఏటా 100 శాతం రిజల్ట్ వస్తోంది. నవోదయ ప్రవేశ పరీక్షకు అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. వీరు 01.05.2014 నుంచి 31.07.2016 మధ్య జన్మించిన వారై ఉండాలి. పరీక్ష రాసే విద్యార్థులు 3, 4, 5, తరగతులు గ్రామీణ ప్రాంతాలలో చదివి ఉత్తీర్ణులవ్వాలి.

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు మరింత గడువు పొడిగించారు. ఈనెల 13న గడువు ముగిసింది. కాగా ఈనెల 27 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రేపాల క్రిష్ణ తెలిపారు. నవోదయాల్లో అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతుండడంతో వారు దేశం లోనే ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిన నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను చేసుకొని భవిష్యత్తు తీర్చి దిద్దుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. అలాగే 9, 11 తరగతుల్లో కూడా ఖాళీ సీట్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సీట్లకు కూడా విద్యార్థులు దరఖాస్తులు వెబ్‌సైట్ ద్వారా చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ సూచించారు.

ఆరో తరగతిలో..

కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో 80 సీట్లు ఉన్నాయి. వీటిలో 60 సీట్లు గ్రామీణ ప్రాంతాల వారికి 20 సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. పాఠశాలలో ఆరో తరగతిలో 80 సీట్లకుగాను ఉమ్మడి జిల్లా నుంచి గతేడాది 5900 దరఖాస్తులు వచ్చినట్లు విద్యాలయ అధికారులు చెబుతున్నారు.దరఖాస్తులు సమర్పించేందుకు ఇప్పటికే మూడు సార్లు గడువు పొడిగించారు. జూన్ 13, జూలై 29, ప్రస్తుతం ఆగస్టు 27 వరకు గడువు తిరిగి పొడిగించారు. డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈసారి ఇంటర్నెట్ ద్వారా మరింత సులభతరంగా దరఖాస్తులను అప్‌లోడ్ చేసేవిధంగా మార్పులు చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు.

9, 11లో ప్రవేశాలకు..

నవోదయ విద్యాలయంలో 2026-27 సంవత్సరంలో 9, 11వ తరగతిలో ఖాళీగా మిగిలిన సీట్లకు కూడా దరఖాస్తులు చేసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సీట్లలో జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల నుంచి 8వ తరగతి విద్యార్థులు 9వ తరగతి కోసం, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతి కోసం దరఖాస్తులు సమర్పించవచ్చు. 9, 11వ తరగతిలో విద్యార్థులు 23-09-2025 చివరీ తేదీగా, 07-02-2026 పరీక్ష తేదీగా నోటిఫికేషన్ విడుదల చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్ఈఐటీఎంఎస్.ఎన్ఐసీఐఎన్/2025వెబ్‌సైట్ ద్వారా పై తరగతులకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రేపాల క్రిష్ణ సూచించారు.



సద్వినియోగం చేసుకోవాలి: రేపాల క్రిష్ణ, ప్రిన్సిపాల్



దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలి. నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు ఇప్పటికే గడువును మూడు సార్లు పెంచారు. ఏటా ప్రవేశ పరీక్ష పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో పాటు అన్ని రకాల వసతులు, సౌకర్యాలు, క్రమశిక్షణ ఉండే నవోదయలో సీటు కోసం దరఖాస్తులు చేసుకునే అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలి.

బురద మేట.. కన్నీటి ఊట


పెంచికలపేటలో కుళ్లిపోయిన పత్తి మొక్కలు

పెంచికలపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల వచ్చిన వరదలకు పత్తి పంటలో బురద మేటలు వేశాయి. రోజుల పాటు మొక్కలు నీటిలోనే ఉండిపోవడంతో మురిగిపోయాయి. ఏటా పెద్దవాగు, ప్రాణహిత నది వరద ప్రవాహానికి ఏటా వందల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింటున్నది. గుండెపల్లి గ్రామంలో సుమారు 50 నుంచి 100 ఎకరాల్లో పత్తి పంట ఇలా ఇసుక, బురద మేటలతో దెబ్బతిని ఎండి పోయింది. సారవంతమైన నేల కోతకు గురై అపార నష్టం వాటిల్లింది. సంబంధిత వ్యవసాయ శాఖా ధికారులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని రైతులు ఆవేదన చెందతున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనా వేసి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంట చేలల్లోకి వరదనీరు


దహెగాంలో నీట మునిగిన పత్తి పంట

దహెగాం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు పంటల్లోకి వరదనీరు చేరి మునగడంతో రైతులకు కన్నీరే మిగిలింది. గంపెడు ఆశలతో వానాకాలం సీజన్ పంటలకు రైతులు శ్రీకారం చుట్టారు. ఏపుగా పెరుగుతున్న పత్తి, కంది, వరి తదితర పంటలను వరదనీరు ముంచెత్తడంతో పెట్టుబడులు కోల్పోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. వానాకాలంలో దహెగాం మండల వ్యాప్తంగా పత్తి 25 వేలు, వరి 9,800, కంది 1,200 ఎకరాల్లో ఇతర పంటలు 3,000 ఎకరాల్లో సాగు చేస్తున్నారని అధికారులు తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎర్రవాగు, పెద్ద వాగు, ఒర్రెల వరదల ఉధృతికి మండలంలోని హత్తిని, కుంచవెల్లి, ఇట్యాల, రాళ్లగూడ, బోర్లకుంట, కోత్మీర్, బీబ్రా, పెసరికుంట, అయినం, దహెగాం, పంబాపూర్, లగ్గాం, ఒడ్డుగూడ, అమర్‌గొండ, దిగిడ, లోహ, రాంపూర్, మొట్లగూడ గ్రామాల్లో పలు పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు. పత్తి 3500 ఎకరాల్లో, వెయ్యి ఎకరాల్లో వరి రైతులు నష్ట పోయినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు వ్యవసాయాధికారి రామకృష్ణ తెలిపారు. ఎకరం పత్తి సాగుకు రూ.15 వేలు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు. పంట పూర్తిగా కోల్పోయామని, ప్రజాప్రతి నిధులు, అధికారులు స్పందించి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

రేపు లోక్ అదాలత్ సన్నాహక సమావేశం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం కోసం సెప్టెంబరు 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశం గురువారం సాయంత్రం ఐదు గంటలకు పోలీసు అధికారులకు జిల్లా న్యాయ స్థానం భవనంలో నిర్వహించనున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న సాయంత్రం 5 గంటలకు బార్ అధ్యక్షుడు, అసోసియేషన్ సభ్యులు, పానల్ అడ్వకేట్లు, బీమా సంస్థల ప్రతినిధులతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ ప్రీ లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యల కేసులు, వివాహం, కుటుంబ కలహాల కేసులు, మోటారు వెహికల్ ప్రమాద కేసులు, ఎస్ఐ యాక్, చిట్‌ఫండ్, చెక్ బౌన్స్ కేసులతో పాటు ఇతర కాంపౌండబుల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం


హైమన్‌డార్ఫ్ దంపతుల విగ్రహాలకు పూలమాల వేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

జైనూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి ఆయన మార్లవాయి బాలుర ఆశ్రమోన్నత పాఠశాల వసతి గృహంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో కలిసి వసతి గృహంలో నిద్రించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ప్రభుత్వం విద్యా రంగాన్ని బలో పేతం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని అన్నారు. అంతకు ముందు హైమన్ డార్ఫ్ దంపతుల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లాకు వచ్చిన మంత్రికి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్ కలిసి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఐకేరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆదిలాబాద్ పార్లమెట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణక్క, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన గిరిజనులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు . జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం దర్తీ అభ జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్, ఆది ఖర్మ యోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంబంధిత శాఖల అధికారులు, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లతో నిర్వహించిన సమావేశానికి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జుగా పథకంలో భాగంగా ఆధి కర్మ యోగి కార్యక్రమాల ద్వారా జిల్లాలో 12 మండలాల పరిధిలోని 102 గ్రామాలలో ఉన్న గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ పథకాలు ప్రతి గిరిజన కుటుంబానికి చేరే విధంగా బ్లాక్ స్థాయి(మండల) మాస్టర్ ట్రైనర్లు, గ్రామ స్థాయి శిక్షకులు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. మిషన్ భగీరథ, గిరిజన సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, వైద్య, ఆరోగ్య, అటవీ, విద్య, శిశు సంక్షేమ శాఖల నుంచి బ్లాక్ స్థాయి ట్రైనర్లు, పంచాయతీ స్థాయి సిబ్బందిని ఎంపిక చేయాలని చెప్పారు. శిక్షణ పూర్తి అయిన అనంతరం జిల్లాలోని 12 మండలాలలో గల 102 గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ప్రతి గ్రామంలో నిర్వహించే గ్రామ సభలో గ్రామాలలో పని చేసే ప్రతి శాఖకు సంబంధించిన సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామసభకు ముఖ్యంగా పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి, విద్యుత్, విద్యా శాఖాధికారులు తప్పని సరిగా హాజరు కావాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, ఇజిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, పంచాయతీ రాజ్ ఈఈ కృష్ణ, మిషన్ భగీరథ ఈఈ సిద్దిక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్‌జోషి, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, పర్యటక శాఖ అధికారి అశోక్, మాస్టర్ ట్రైనర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



40 శాతం లాభాల వాటా ఇవ్వాలి


సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కార్మికులకు 40 శాతం లాభాల వాటా ఇవ్వాలని శ్రామికశక్తి గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఏఐఎఫ్‌టీయూ) గౌరవ అధ్యక్షురాలు విమలక్క, రాష్ట్ర కార్యదర్శి ఎం. పోచమల్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సింగరేణి సీఎండీ ఎన్. బలరాంకు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, నిర్దేశిత ఉత్పత్తిని కార్మికులు సాధించినా ఇంతవరకు వారి లాభాల వాటాపై ప్రకటన చేయకపోవడం సరికాదన్నారు. కాంట్రాక్టు కార్మికులు ఈసారి రూ. 10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వెల్తురు సదానందం, విజయ్, శంకర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఖనిజాల అన్వేషనలో సింగరేణి

మందమర్రిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఖనిజాల అన్వేషన విభాగానికి సంబంధించి కర్నాటకలోని దేవదుర్గలో గల బంగారం, రాగి లైసెన్స్‌లు సింగరేణి సంస్థ దక్కించు కుందని సీఅండ్ఎండీ బల్‌రాం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ సింగరేణి చరిత్రలోనే తొలిసారి కిలక ఖనిజాల రంగంలోకి సింగరేణి సంస్థ అడుగుపెట్టడం కొత్తచరిత్ర అని తెలిపారు. భవిష్యత్‌లో మైనింగ్ చేసే సమయంలో 37.75శాతం రాయితీ పొంద నున్న సంస్థ సింగరేణి అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆలోచన విదానంతో సంస్థ వివిధ రంగాల్లో ఆర్థిక ప్రగతిని సాధిస్తుందని తెలిపారు.ఈఅన్వేషణ కోసం సుమారు 70 కోట్ల ఖర్చు అవుతుండగా దీ నిలో 20 కోట్లు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంద న్నారు. ఈ గనులను దక్కించుకోవడం లైసెన్స్‌ను వేలం దక్కించుకోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కృషి చేశారని తెలిపారు.

ఉద్యోగులు సమయ స్ఫూర్తితో పని చేయాలి



కార్మికులకు బహుమతులు అందిస్తున్న ఇన్‌చార్జీ జీఎం విజయ్‌ప్రసాద్

మందమర్రిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు పోటీ మార్కెట్ ప్రపంచంలో నాణ్యమైన ఉత్పత్తులు సాధిస్తూ సమయస్ఫూర్తితో పని చేయాలని మందమర్రి ఏరియా ఇన్‌చార్జీ జీఎం విజయ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఏరియాలోని కేకే 5 గనిపై నిర్వహించిన మల్టీ డిపార్టుమెంట్ సమావేశానికి హాజరై మాట్లాడారు. గతంలో సింగరేణి సంస్థ బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లినప్పుడు ఉద్యోగులు మరింత కష్టపడి సంస్థను గట్టెక్కించారని, వారి సేవలు మర్చిపోలేనివన్నారు. ప్రస్తుతం సింగరేణిలో యువ రక్తం ఉన్నందున విధి నిర్వహణలో నిర్లక్షం, పరధ్యానంగా ఉండవద్దని, విధులపైనే ధ్యాస పెట్టాలన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు చేయాలన్నారు. దేశంలోని ఆయా పరిశ్రమలకు 1500 మిలియన్ టన్నుల అవసరాలు ఉండగా వెయ్యి మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి సాధిస్తున్నామని, దీంతో ఆయా ప్రైవేటు సంస్థలు ఇతర దేశాల నుంచి తక్కువ ధరకే బొగ్గును అందించేందుకు సిద్దంగా ఉన్నాయన్నారు. బొగ్గు ఉత్పత్తికి రూ. 8 వేలు ఖర్చు అవుతుండగా దీన్ని విక్రయిస్తే రూ. 4 వేలే వస్తుందన్నారు. సింగరేణిని అబివృద్ధి పథంలో నడిపించాలంటే అందరు అంకిత భావంతో పనిచేయాలన్నారు. కేకే 5 గనికి మంచి రికార్డులు ఉన్నాయని తెలిపారు. అనుకోని ప్రమాదం జరిగి గనిలో ఒక కార్మికుడు మృతిచెందడం బాధకరమని తెలిపారు. మల్టీ డిపార్టుమెంట్ అధికారులు చెప్పే విషయాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం మల్టీ డిపార్టుమెంట్ సిబ్బంది అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పిన వారికి ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రూపు ఏజెంట్ రాంబాబు, పీఎం శ్యాంసుందర్, గని మేనేజర్ శంభునాథ్‌పాండే, ఐఈడీ ఇంజనీర్ ప్రవీణ్‌కుమార్, ఏఐటీయూసీ నాయకులు కంది శ్రీనివాస్, రవళి, తదితరులు పాల్గొన్నారు.

వారసులకు ఉద్యోగం ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో అన్‌ఫిట్ అయిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని జీఎల్‌బీకేఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం సీఎండీ బలరాంను కలిసి వారు వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, అనేక రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్న కార్మికులకు అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకుంటే వారిని ఫిట్ ఫర్ డ్యూటీ అని వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వక పోవడం సరికాదన్నారు. దీనివల్ల వారి కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయని, ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్‌కు ఘన సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి డైరెక్టర్(ఈ అండ్ ఎం) డి సత్యనారాయణ రావును శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనను ఏరియా స్టోర్స్, సీహెచ్‌పీ ఉద్యోగులు సైతం సత్కరించారు. 39 ఏళ్ల 5 నెలల పాటు ఆయన సంస్థకు సేవలందించడం సంతోషదాయకమని పేర్కొన్నారు. అనంతరం డైరెక్టర్ ఆధ్వర్యంలో సీహెచ్‌పీలో ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగిని ఆయన సత్కరించి, ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(ఏరియా స్టోర్స్) మల్లయ్య, సీహెచ్‌పీ ఎస్ఈ చంద్రలింగం, టింబర్ యార్డ్ ఇన్‌చార్జి రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 30న శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో నిర్వహించే 55వ వార్షిక రక్షణ బహుమతుల ప్రదా నోత్సవం ఏర్పాట్లను జీఎం(రక్షణ) చింతల శ్రీనివాస్, ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్, రామగుండం రీజియన్ జీఎం(రక్షణ) మధుసూదన్ తదితరులు పరిశీలించారు.

15న పెన్షన్‌దారుల భారీ ప్రదర్శన

శ్రీరాంపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోల్‌కతాలోని కోల్ ఇండియా ప్రధాన కార్యాలయం ఎదుట వచ్చే నెల 15న భారీ ప్రదర్శన చేపట్టనున్నారు. కోల్‌మైన్స్ పెన్షన్-1998 స్కీం సవరించి కరువుభత్యంతో కూడిన పెనన్ పెంచాలని, కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్ మెడికల్ స్కీంలో మార్పులు చేసి అధికారులకు, ఉద్యోగులకు ఒకేరీతిన వైద్య సదుపాయం కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరి ంచాలని ఆందోళన చేపడతామని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు.

23న ఎంపిక పోటీలు

రెబ్బెన, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా సబ్ జూనియర్, జూనియర్ యోగసనాల క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 23న జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్టు యోగసనాల స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేసరి అంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి ఏడు కొండలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10-14 సంవత్సరాల వయస్సు(బాలురు, బాలికలు) 14-18(బాలురు, బాలికలు) ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందులో ట్రేడిషన్ యోగాసన, ఫార్వర్డ్ బెండింగ్ యోగాసన, ట్విస్టింగ్ యోగాసన, లెగ్ బ్యాలెన్స్ యోగాసన, హ్యాండ్ బ్యాలెన్స్, ఆర్టిస్ట్ యోగాసన, రిథమిక్ యోగాసన పెయిర్ విభాగాల్లో చేపడుతున్నట్టు తెలిపారు. ఎంపికైన వారు నిర్మల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి యోగాసన ఛాంపియన్ షిప్‌కు ఎంపిక అవుతారని తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి..
ఒకరిపై కేసు నమోదు

లక్షెట్టిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని ఊత్కూర్ చౌరసాలో ఊట్నూర్ డిపోకు చెందిన ఆర్టీసీ కాంట్రాక్టు డ్రైవర్ సిరామి విజయేందర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం విధి నిర్వహణలో భాగంగా ఆర్టీసీ బస్సును డ్రైవర్ విజయేందర్ నడుపుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో లక్షెట్టిపేటకు చెందిన దూడ శంకర్ అనే వ్యక్తి బస్సును ఆపి తన బైకును డీకొట్టావంటూ బూతులు తిడుతూ దాడి చేశా డు. ఈ విషయమై డ్రైవర్ లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో నిందితుడు శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు..

వాగును పరిశీలించిన కలెక్టర్

మందమర్రిరూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అందుగులపేట గ్రామంలోని పెద్దవాగు ను మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. గ్రామస్థులు వాగు దాటలేక ఇబ్బందులు పడుతున్నామని, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత కూలిన బ్రిడ్జిని తొలగిస్తామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తహసీల్దార్ సతీష్‌కుమార్, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జీ జీవన్‌కుమార్, ఆర్‌ఐ గణపతి, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

వేమనపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని నీల్వాయి, కొత్తపల్లి, సుంపుటం, బుయ్యారం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నీల్వాయి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్‌కుమార్ పార్టీ కండు వాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, నాయకులు లింగా గౌడ్, వెంకటేష్, సత్యనారాయణ, రాజన్న, జాహిద్ పాల్గొన్నారు.

టీఎల్ఎంతో అర్థవంతమైన అభ్యసన

నెన్నెల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) :అర్థవంతమైన అభ్యసనకు టీఎల్ఎం (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ దోహదం చేస్తుందని ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆవడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి టీఎల్ఎం మేళాలో పాల్గొని మాట్లాడారు. బోధన సామగ్రి ఉపయోగించడంతో టీచర్లకు శ్రమ తగ్గడంతో పాటు పిల్లలకు విషయం పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. ఆవడం, నెన్నెల హెచ్ఎంలు రాజ్యలక్ష్మి, చంద్రశేఖర్, డీఆర్పీ ఖాదర్ పాల్గొన్నారు.

29న ఓరియంట్ ఎన్నికలు

కాసిపేట,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న ఓరియంట్ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీసీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. వారం రోజులుగా కోర్టు పరిధిలో వాదనలు కొనసాగాయి. మంగళవారం హైకోర్టులో ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం ఈ నెల 29న ఓరియంట్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో డీసీఎల్ అందుకు తగిన ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమాన విధిస్తాం

బెల్లంపల్లి, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తులు ఎవరైన నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే జరిమానలతో పాటు కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు సిబ్బంది దుకాణ సముదాయాలను తనిఖీ చేపట్టారు. అటు షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండడంతో వారికి జరిమాన విధించారు.

గదుల కొరతతో అవస్థల బడి



వెంకటాపూర్ ఉన్నత పాఠశాల

- ఐదు తరగతులకు రెండే గదులు
- 15 ఏళ్లుగా గదుల కొరత
- వరండాలో తరగతులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు..
- పట్టించుకోని అధికారులు

భీమిని, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూస్తాం అంటున్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం పాఠశాలలకు వస్తున్న కొద్ది మంది పేద విద్యార్థులకు నిరాశ మిగులుస్తోంది. పాఠశాలలో విద్యార్థులకు, తరగతులకు సరిపోయే గదులు లేకపోవడంతో విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు తిప్పలు తప్పడం లేదు. వెంకటాపూర్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఆ పాఠశాలలో తరగతి గది కష్టాలు గుర్తించిన విద్యాశాఖ అదనపు గదులను మంజూరు చేసింది. దీంతో హడావుడిగా శిలాఫలకం వేశారు. అభివృద్ధి పనులకు స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయించిన ఘనత తమదేనని గొప్పలు చెప్పి పోయారు. అనంతరం ఐదు సంవత్సరాలు గడిచాయి. వేసిన శిలా ఫలకాలు వెక్కిరిస్తున్నాయి.



వరండాలో తరగతి నిర్వహణ

అసంపూర్తిగా..

మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యను దృష్టి లో పెట్టుకొని 2011లో ప్రజా ప్రతినిధులు, అధికారులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికి ఆర్ఎంఎస్ఏ నిధులతో రూ. 31.34 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. పాఠశాల భవనం నిర్మిస్తున్నారనే విద్యార్థుల కలలు శిలా ఫలకాలతోనే ఆగిపోయాయి. ఈ నిధులతో పాఠశాల భవనానికి పిల్లర్ల స్థాయిలోనే పనులు నిలచి పోయాయి.

చెట్ల నీడలో, వరండా చదువులే...

ప్రస్తుతం వెంకటాపూర్ ఉన్నత పాఠశాలలో రెండు గదులు మాత్రమే ఉండటంతో విద్యార్థులు చెట్ల నీడలో, వరండాల్లో పాఠాలు బోధిస్తున్నారు. ఇక్కడి పాఠశాలలో 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు 70 మంది విద్యార్థులకు రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో ఇరుకు గదుల్లో ఒకే తరగతిలో రెండేసి తరగతులు బోధించాల్సి వస్తుందని ఉపాధ్యాయులు వాపోయారు. వర్షం పడినప్పుడు పాఠ శాలలో ఒకే తరగతిలో మూడు, నాలుగు తర గతుల విద్యార్థులను కూర్చొబెట్టి బోధించాల్సి వ స్తోందన్నారు. గదులు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా పాఠశాల అదనపు గదుల నిర్మాణం చేపట్టి విద్యార్థుల కష్టాలు తీర్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



అసంపూర్తిగా నిర్మించిన ఉన్న పాఠశాల భవనం

తరగతి గదులు సరిపోవడం లేదు....

నాంచర్ల రాఘవ, 9 వ తరగతి, వెంకటాపూర్



మా పాఠశాలలో రెండు గదులు మాత్రమే ఉండటంతో తరగతి గదులు సరిపోవడం లేదు. అధికారులు అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేసినట్లయితే ఇబ్బందులు తప్పుతాయి. వానా కాలంలో చాలా ఇబ్బందిగా ఉంది. గదుల కొరత ఉండటంతో శ్రద్ధగా చదువలేకపోతున్నాం. మూత్రశాలలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

పాఠాలు అర్థం కావడం లేదు....

టాకిరె అంజలి, 7వ తరగతి, వెంకటాపూర్



పాఠశాలలో గదులు లేకపోవడంతో ఆరు బయట చెట్ల కిందనే చదువాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో బ్లాక్ బోర్డు లేకపోవడంతో గణితం, సైన్స్ పాఠాలు అర్థం కావడం లేదు. ఆరు బయట రెండేసి తరగతులను ఉంచి పాఠాలను బోధించడంతో ఏకాగ్రతతో చదువలేక పోతున్నాం.

అదనపు గదులకోసం ప్రతిపాదనలు పంపాం...

కృష్ణమూర్తి, ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడు, వెంకటాపూర్



పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రతిపాదనలు పంపాం. తరగతి గదుల కొరత ఉండటంతో ఉన్న రెండు గదులతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. తరగతి గదుల కొరతపై ఉన్నతాధికారులకు విన్న వించాం. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేస్తే పాఠశాలకు గదుల కొరత తీరుతుంది. తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులకు సరైన విద్యాబోధన చేయలేక పోతున్నాము. విద్యార్థుల సంఖ్యకు అనుగునంగా తరగతి గదులను నిర్మించి ఇవ్వాలి.

వాగుపై వంతెన నిర్మించాలి

తాండూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపూర్ పంచాయతీలోని ప్రధాన రహదారిలో ఉన్న భీమన్న వాగుపై వంతెన నిర్మించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మామిడి విఘ్నేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వాగును పరిశీలించి మాట్లాడారు. ఈ రహదారి గుండా గంపనపల్లి, బెజ్జాల, అబ్బాపూర్, అసలమాడ, దొడ్డి గూడెం, సుక్కుగూడెం, బీర్గుడెం, గంటల గూడెం, బొగడగూడెం, లచ్చు గూడెం గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారన్నారు. ప్రతి వర్షాకాలం వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రోడ్డు దాటలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. ఈ గ్రామాల ప్రజలు కూలీ పనులకు, ఇతర పనులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలని గ్రామస్థులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పి నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం, స్పందించి వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, శ్రీనివాస్, రవి, దుర్గ చరణ్, శంకర్, సతీష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఎన్నిక

మంచిర్యాలక్రైం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. యువజన అధ్యక్షుడిగా పోలం పల్లి సత్యం, ప్రధాన కార్యదర్శిగా కుర్మిల్ల శ్రీని వాస్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయిబ్రాహ్మణ హక్కుల కోసం నిత్యం పోరాడుతామన్నారు. హక్కులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

నెన్నెల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌తో హైదరాబాదులో సెప్టెంబరు 1న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షకార్యదర్శులు కోడూరి శ్రీనివాస్, మల్లాగౌడ్ పిలుపునిచ్చారు. నెన్నెల ఉన్నత పాఠశాలలో మంగళవారం మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా ఉంటుందన్నారు. పాత పెన్షన్ విధానం అమలు కోసం తమ సంఘం అవిశ్రాంతంగా పోరాడుతుందని పేర్కొన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం జయ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సొల్లశ్రీని వాస్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జైపూర్ : పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న చేపట్టిన మహా ధర్నాను జయప్రదం చేయాలని పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు పత్తిపాక రాజన్న పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పీఆర్‌టీయూ మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అమరేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ప్రజావేదిక

వేమనపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పథకం ప్రజావేదికను నిర్వహించారు. దీనికి డీఆర్‌డీవో కిషన్ అధ్యక్షత వహించారు. 2024-25 సంవత్సరంలో మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన 291 పనులకు గాను సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహించారు. అధికారులు నిర్వహించిన ప్రజావేదికలో 291 పనులకు వేతన చెల్లింపులు రూ. 3.90 కోట్లు జరిగినట్లు అధికారులు తెలిపారు. మెటీరియల్ కింద మండలంలో రూ. 65 లక్షల చెల్లింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీలో మస్టర్లలో కొట్టివేతలు, రికార్డుల్లో కొన్ని తప్పులు జరిగినట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. మండలంలోని 13 గ్రామాల్లో అవకతవకలు జరిగినందుకు రూ. 17485 రికవరీకి అధికారులు ఆదేశించారు. విజిలెన్స్ అధికారి కిరణ్, ఎంపీడీవో కుమారస్వామి, ఎస్ఆర్‌పీ రవి, ఏపీవోలు సత్య ప్రసాద్, మహేశ్వర్‌రెడ్డి, ఈసీ మధుకర్, డీఆర్ పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి సందర్భంగా గణపతి మండపాల నిర్వహకులు నిబంధనలు పాటించాలని అగ్నిమాపక అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక స్నేహ ఇన్‌కన్వెన్షన్ హాలులో నిర్వహించిన గణేష్ మంటపాల నిర్వహకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గణపతి మండపాల వద్ద ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. హిందూ ఉత్సవ సమితి పట్టణాధ్యక్షుడు రాజ్‌కిరణ్, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి కృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, హరికృష్ణ, పాల్గొన్నారు.

కాసిపేట: ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని కాసిపేట, దేవాపూర్ ఎస్ఐలు ఆంజనేయులు, గంగారాంలు తెలిపారు. గణేష్ విగ్రహాలను నిలుపుకునేవారు స్థానిక పోలీసుస్టేషన్ ఆలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

చిత్రకళ ఉపాధ్యాయుడికి పద్మచక్ర అవార్డు



బాబు మోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

జైపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, చిత్రకళ ఉపాధ్యాయుడు చిప్పకుర్తి శ్రీనివాస్ పద్మచక్ర అవార్డును అందుకున్నారు. మంగళవారం హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ హాస్యనటుడు, మాజీ మంత్రి బాబుమోహన్ చేతుల మీదుగా శ్రీనివాస్ అవార్డు అందుకున్నాడు. రాష్ట్ర నలుమూలల నుంచి ఎంతో మంది చిత్రకళాకారులు, కవులు పాల్గొన్నారు.

వరద తాకిడికి దెబ్బతిన్న కల్వర్టులు

నస్పూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలో కురిసిన వర్షాల కారణంగా వరద తాకిడికి వినూత్న కాలనీ, సంఘ మల్లయ్య పల్లెలోని కల్వర్టులు కోతకు గురి కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తోళ్ళవాగుపై వినూత్న కాలనీకి వెళ్లే మార్గంలోని కల్వర్టు కోతకు గురై కొట్టుకుపోయింది.. సంఘ మల్లయ్య పల్లె సమీపంలోని ఒర్రె పై కల్వర్టు కూడా కోతకు గురైంది. సమీపంలోని ఆయా ప్రాంతాల వాసులు రాకపోకలు లేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సివస్తోంది. ఇతర ప్రాంతాల మీదుగా ప్రయాణించాల్సివస్తోంది.



నస్పూర్‌లోని వినూత్న కాలనీలో కోతకు గురైన కల్వర్టు

ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

తాండూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌లోని ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని మోకుదెబ్బ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ఎస్ఐ కిరణ్‌కుమార్ హాజరై మోకుదెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి మొండి గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌గౌడ్‌లతో కలిసి పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రవీందర్ రె డ్డి, సంఘం నాయకులు శంకర్‌గౌడ్, పున్నంగౌడ్, మండల కాంగ్రెస్ అధ్య క్షుడు ఈసా, తిరుపతి, శంకర్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలివాలి

దండేపల్లి ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యువకులు ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాదాతలుగా నిలువాలని జిల్లా ఆల్ ఇండియా రెడ్ క్రాస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్ అన్నారు. గుడిరేవు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచు సంతపురి జనార్థన్ ప్రథమ వర్థంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు రఘువరన్, వెంకటేష్ ఆధ్వర్యంలో గ్రామంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన 20 మంది యువకులకు రెడ్ క్రాస్ సొసైటీ వారిచే సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, సిబ్బంది మాధవి, వేణు, హరీష్, నాయకులు దయాకర్, రమణ, రాజయ్య, మోహన్, రఘు, వెంకటేష్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి

మంచిర్యాలక్రైం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): మనుషుల మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలని కోర్స్ కోఆర్డినేటర్ మూర్తి అన్నారు. మంచి ర్యాల పట్టణంలో బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రజ్వళ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా బాలుర, బాలికలకు రెండు రోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా వారు మాట్లాడారు. మానవ అక్రమ రవాణ అనేది ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తోందన్నారు. అనంతరం సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణను ఆదిలోనే అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులు పాల్గొన్నారు.

కేబుళ్ల తొలగింపు

మంచిర్యాలక్రైం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): నార్తర్న్ పవర్ డిస్ట్రిబూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ సీఎండీ కరునాటి అరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు మంచిర్యాల పట్టణంలో విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్లను తొలగించి నట్లు మంచిర్యాల ఏడీఈ వేణుగోపాల్ తెలిపారు. గత సంవత్సరం నుంచి స్తంభాలపై ఉన్న కేబుళ్లను తొలగించమని కేబుల్ ఆపరేటర్లకు విన్నవించినప్పటికీ వారు పట్టించుకోలేదన్నారు. ఏడీఈ పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతు వ్యతిరేక ధోరణిని అవలంబిస్తోంది

జైపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం రైతు వ్యతిరేక ధోరణిని అవలంభిస్తోందని చెన్నూరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు రాజారమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సుందిళ్ల బ్యారేజ్‌ను నాయకులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ బ్యారేజీ కూలిందని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదన్నారు. గోదావరి తెలంగాణ జీవనది అని 74 గేట్లను ఎత్తి పక్క రాష్ట్రాలకు నీటిని తరలించడం సముద్రంలోకి వదిలివేస్తున్నారన్నారు. ప్రాజెక్టు సురక్షితంగానే ఉందని ప్రభుత్వం వెంటనే గోదావరి నీటిని నిల్వ చేసి రైతులకు అందించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు మధుకర్ రెడ్డి, తిరుపతి, సమ్మయ్య, సురేందర్‌రెడ్డి, లింగస్వామి, సుజిత్‌రావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు తీరేదెన్నడు...?

(5వ పేజీ తరువాయి)

గణనీయంగా తగ్గాయి. ఖర్చులు పెరగడం, కమీషన్లు తగ్గడంతో ఇబ్బందుల పాలవుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున అమ్మ హస్తం మాదిరిగా నిత్యావసరాల సరుకుల విక్రయంపై చర్యలు తీసుకోవాలని డీలర్లు వేడుకుంటున్నారు.

మిగిలేది రిక్త హస్తాలే...

ఖర్చులన్నీ పోనూ చివరకు మిగిలేది రిక్తహస్తాలే అని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. దిగుమతి చా ర్జీలు సైతం తామే భరించడం వల్ల ఏమీ మిగలడం లేదంటున్నారు. ఒక్కోసారి తామే అదనంగా భరించాల్సిన దు స్థితి ఏర్పడుతుందనేది డీలర్ల వాదన. ఒక డీలర్ వంద క్వింటాళ్ల బి య్యం బస్తాలను దిగుమతి చేసుకుంటే రవాణా, డ్రైవర్, కూలీ మొత్తం గా రూ.2 వేల వరకు భరించాల్సి వస్తోందని చెబుతున్నారు. వంద క్విం టాళ్ల బియ్యాన్ని విక్రయిస్తే క్వింటాలుకు రూ.140 చొప్పున మొత్తంగా రూ.14 వేలు కమీషన్ రూపంలో డీలర్‌కు లభిస్తుంది. ఈ ఆదాయంలో షాపు అద్దె, విద్యుత్ చార్జీలు, హమాలీ కూలీలు, ఇతరత్రా ఖర్చుల చెల్లింపులు జరిగితే ఏమీ మిగలడం లేదని చెబుతున్నారు. ఈ క్రమంలో దిగుమతి చార్జీలు మరో భారంగా మారాయంటున్నారు. దీనిని ప్రభుత్వం గుర్తించి దిగుమతి చార్జీలను భరించాలని డిమాండ్ చేస్తున్నారు. దీని ద్వారా డీలర్‌కు నెలకు రూ.2 వేలు మిగిలే అవకాశం ఉంటుందంటున్నారు. ఇక ఎంఎల్ఎస్ పా యింట్లలో కాంటా సరిగ్గా ఉండక తూకంలో తక్కువ బియ్యం వస్తున్నాయని, బస్తాకు రెండు కిలోల బియ్యం తక్కువగా వస్తున్నాయని చెబుతున్నారు. ఈ భారాన్ని కూడా తామే మోయాల్సి వస్తోందని డీలర్లు చెబుతున్నారు. క్వింటాల్ బియ్యం బస్తా కచ్చితమైన తూకంతో డీలర్లకు సరఫరా చేయాలని, షాపు రెన్యూవల్ శాశ్వత ప్రాతిపదికన జరగాలని, ప్రతి నెల 1వ తేదీలోగా బియ్యం సరఫరా చే యాలని డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



మంచిర్యాలలో కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

మంచిర్యాలక్రైం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలో ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా ఫొటోగ్రఫీ అధ్యక్షులు అప్పాసు రామన్న, ప్రధాన కార్యదర్శి దేవి రవీందర్, నాయకులు శ్వాస తిరుపతి,కొప్పెర శ్రీనివాస్, ఆసంపల్లి రాజబాపు, మొగిలి సత్యనారాయణ, శ్రీనివాస్, విజయ్, తిరుమ ల్ రెడ్డి, బాలాజీ, మల్లిఖార్జున్, కె. రాజు, ఎంకే రాము, రమణయ్య, లచ్చన్న జిల్లాలోని ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

బెల్లంపల్లి: పట్టణంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం సందర్భంగా ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అ సోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫి దినోత్సవాని ఘనంగా జరుపుకున్నారు. ఫొటో గ్రాఫర్లు తిలక్ స్టేడియం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ ఫొటోగ్రాఫర్లకు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు వేణు, గౌరవ అధ్యక్షుడు కుంబాల రాజేశ్ ప్రధాన కార్యదర్శి విజయ్, కోశాధికారి విక్రమ్‌తో పాటు ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

దండేపల్లి : వేల పదాలు చెప్పలేని భావాన్ని ఒక ఫోటో చెబుతుందని ఫొటో స్టూడియో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అప్పసు రామన్న, శ్వాన తిరుపతి అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మేదరిపేటలో దండేపల్లి మండల ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్స్‌ల ఆధ్వర్యంలో సంఘం నాయకులతో కలిసి మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫొటో కెమెరా సృష్టికర్త చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, కేక్ కట్ చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ నాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ముక్కెర శ్రీనివాస్, మండల అధ్యక్ష కార్యదర్శులు బోడకుంట మహేందర్, చరణ్, జిల్లా కుటుంబ భరోసా ఇన్‌చార్జి సురేష్, నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరు : చెన్నూరు పట్టణంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మండల ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రమోద్, ప్రకాష్, అంజి, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

తాండూర్ : తాండూర్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ కిరణ్‌కుమార్, క్లబ్ అధ్యక్షుడు దేవరకొండ రాజయ్యలు ఫొటోగ్రాఫర్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సెక్రటరీ బాల ప్రసాద్, ట్రెజరర్ సంతోష్‌కుమార్, సభ్యులు శంకర్, వెంకటేశం, బాపురెడ్డి, ఉమ్రావ్‌సింగ్, రాంచందర్, శ్రీనివాస్, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు సమ్మన్న, ప్రధాన కార్యదర్శి శోభన్, రమేష్, కృష్ణమూర్తి, మోయిన్ పాల్గొన్నారు.

కన్నెపల్లి : మండల కేంద్రంలోని శివశిల్పి ఫోటో స్టూడియో ఆవరణలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ వేడుకలను మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి సంజీవ్, సాయి, మాజీ ఉపస ర్పంచు వెంకటేష్, సాయి, హన్మంతు, మల్లేష్, నరేష్ పాల్గొన్నారు.

నెన్నెల : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నెన్నెలలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పితామ హుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూల మాలలు వేసి, ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని తీర్మాణం చేశారు.

జన్నారం: సమాజంలో ఫొటోగ్రఫీల పాత్ర కీలమని మంచిర్యాల జిల్లా అధ్యక్షులు అప్పాసు రామన్న అన్నారు. ప్రతి వ్యక్తికి పది రూపాయలతో స్కీంలోచేరడం వల్ల లక్ష 70వేల వరకు అందుతాయన్నారు. వినాయకలర్ ల్యాబ్ అధినేత కొండ నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, జిల్లా కోశాధికారి ప్రభాకర్, రాజమౌళి పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో ఫొటోగ్రఫీ దినోత్సవం జరుపుకుంటున్న ఫొటోగ్రాఫర్లు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
బుధవారం 20 ఆగస్టు 2025





గేట్లు ఎత్తివేయడంతో కిందకు దూకుతున్న నీరు

ఎల్లంపల్లికి భారీ వరద

● 40గేట్లు ఎత్తివేత

హాజీపూర్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : శ్రీపాద ఎల్లంపల్లిసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీ వరద వస్తుండడంతో ప్రాజెక్టు 40గేట్లు ఎత్తి దిగువ గోదావరికి నీటిని వదులుతున్నారు. శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో 3,67,461 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రూపంలో వస్తోంది. 4లక్షల క్యూసెక్కుల నీటిని గేట్లుఎత్తి కిందకు వదులుతున్నారు. ప్రస్తుతం 16.210 టీఎంసీల నీరు నిల్వఉంది. నంది పంప్‌హౌజ్ నుంచి నుంచి 3150 క్యుసెక్కుల నీటిని మిడ్ మానేర్‌కు ఎత్తి పోస్తున్నారు.

ప్రాజెక్టు 40గేట్లు ఎత్తడంతో భారీగా ఇన్‌ఫ్లో భారీగా ఉండడంతో హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే, ఎస్ఐ స్వరూప్ రాజ్‌లు ప్రాజెక్టును పరిశీలించి ప్రాజెక్టుపై రాకపోకలను నిలుపుదల చేశారు.

న్యూస్ బాక్స్

సంఘమల్లయ్య పల్లె ఒర్రెపై వంతెన నిర్మించాలి

నస్పూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సంఘమల్లయ్య పల్లెలో ఒర్రెపై ఉన్న కల్వర్టు కురుస్తున్న వర్షాల కారణంగా వరద తాకిడికి దెబ్బతిని రాకపోకలకు అనుకూలంగా లేకుండా పోయిందని, వెంటనే అక్కడ బ్రిడ్జి నిర్మాణం చేయా లని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం నాయకులు కల్వర్టును పరిశీలించారు. సీసీసీ, ప్రశాంత్ నగర్, సుభాష్‌నగర్, ఆదర్శనగర్, కృష్ణా కాలనీల నుంచి సంఘ మల్లయ్య పల్లెకు ఈ మార్గం ద్వారా ప్రయాణం సౌకర్యంగా ఉండేదన్నారు. వరద తాకిడికి కల్వర్టు కోతకు గురై దెబ్బతిందన్నారు. దీంతో రాకపోకలు నిలిచిపోయాయ న్నారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గోమా సప్రకాష్, నస్పూర్ మండల కార్యదర్శి మిడివెల్లి రాజ్‌కుమార్, నాయకులు గంగాధరచారి, పాయిరాల రాములు, పోసక్క, లక్ష్మి, శంకర్ పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి అవసరం

నస్పూర్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని నస్పూర్ ఎస్ఐ ఉపేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న వినాయక చవితి పండుగ సందర్భంగా నస్పూర్ పోలీసు స్టేషన్‌పరిధిలో మండపాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకొని ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి సమాచారం అందించాలని ఎస్ఐ ఉపేందర్‌రావు తెలిపారు.

భూ భారతి సమస్యల పరిష్కారంలో సర్వేయర్లదే కీలక పాత్ర

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై అందిన దరఖాస్తు లను పరిష్కరించడంలో సర్వేయర్లదే కీలకపాత్ర అని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో బ్యాచ్ లైసెన్స్ సర్వేయర్లశిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతిలో సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించామని, ఈ దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని ఈ ప్రక్రియలో సర్వేయర్ల పాత్ర కీలకమైందన్నారు. సర్వేయర్లు దరఖాస్తులను రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి సీలింగ్ భూమిని గుర్తించాలని, ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. పట్టాదారులు తమ భూమి అభివృద్ధి సమయంలో రోడ్లకు కొంత భూమిని కేటాయించాలని, ఈ విషయాన్ని పట్టాదారులకు వివరించాలన్నారు. మొదటి విడతలో 162 మందికి, రెండో విడతలతో 169మంది సర్వే యర్లకు శిక్షణ అందించామన్నారు. సర్వేయర్లు తమ విధులను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు.

కల్వర్టు నిర్మాణం చేపట్టాలి

మందమర్రిటౌన్,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు భాగ్యనగర్‌కాలనీ వెళ్లే ప్రధాన కల్వర్టు పూర్తిగా దెబ్బతిందని మరమ్మతులు లేదా నూతన కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరుతూ కాలనీవాసులు మున్సిపల్ డీఈ సుమతికికి వినతిపత్రం సమర్పించారు. వర్షాకాలంలో వరద ఉధృతి ఎక్కువై కాలనీలోకి నీరు చేరుతుందని తెలిపారు. వర్షపు నీటితో తాము వ్యాధుల భారినపడుతున్నామని తెలిపారు. దీనిపై మున్సిపల్ డీఈ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

బదిలీపై వెళుతున్న అధికారికి సన్మానం

దండేపల్లి ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం శ్రీసత్య నారా యణస్వామి దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్ బదిలీ కావడంతో మంగళ వారం శాలువతో ఘనంగా సత్కరించారు. చంద్రశేఖర్ కాళేశ్వరం దేవస్థానానికి బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో ఆదే దేవస్థానంలో సూపరిం డెంట్ బి శ్రీనివాస్ గూడెంకు రానున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

'నవోదయ' ప్రవేశాలకు గడువు పొడిగింపు

- ఈ నెల 27 వరకు దరఖాస్తులకు అవకాశం
- డిసెంబర్ 13న రాత పరీక్ష

6

రేషన్ డీలర్ల సమస్యలు తీరేదెన్నడో..?



మానవతా దృక్పథంతో స్పందించాలి..



నెలవారీ కమీషన్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గౌరవ వేతనం రూ.5 వేలు వెంటనే కల్పించాలి. డీలర్లకు ప్రస్తుతం ఉన్న కమీషన్ రూ. 140నుంచి రూ. 300కు పెంచుతామన్నారు. ఒక్కొక్కరికి రూ. 5లక్షల ఇన్సూరెన్స్ వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. డీలర్ చనిపోతే అతని స్థానంలో వారసులకు అవకాశం కల్పిస్తామన్నారు. కరెంట్ బిల్లు, గది కిరాయలు చెల్లిస్తా మన్నారు. అనుకున్న ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనందున డీలర్ల సమస్యలపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు మానవతా దృక్పథంతో స్పందించి, సమస్యలు పరిష్కరించాలి.

- మోటపలుకుల సత్తయ్య, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

- హామీలతోనే ఏళ్లతరబడి జాప్యం
- వినతులు పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- గౌరవ వేతనం డిమాండ్ బుట్టదాఖలు
- నెలవారీ కమీషన్లూ జమకాని వైనం
- నెలంతా కష్టపడితే మిగిలేది రిక్తహస్తాలే

మంచిర్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్లు అనేక సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నారు. పాలకులకు ఏళ్ల తరబడి మొర పెట్టుకుంటున్నా మోక్షం లభించడం లేదు. నెల రోజులు శ్రమ పడితే చివరకు మిగిలేది రిక్త హస్తాలేనన్న అభిప్రాయాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సమస్యలు తీరుతాయని గంపెడు ఆశలు పెట్టుకున్న డీలర్లకు నిరాశే ఎదురైంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డిమాండ్‌లు తీరుస్తామనే హామీలు డీలర్లను ఊరిస్తూ వచ్చాయి. ఏ ఒక్క సమస్యా తీరలేదు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ డీలర్లకు హామీలు గుప్పించింది. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం కల్పిస్తామని మాటిచ్చింది. ఏడాది గడిచినా అది కార్యరూపం దాల్చలేదు. ఇలా ఎన్నో సమస్యలను పాలకులకు ఎప్పటికప్పుడు విన్నవిస్తున్నా, కనీసం చర్చలు కూడా జరపడం లేదనే ఆవేదన డీలర్లను వేధిస్తోంది. ప్రజాపాలనలో తమ కష్టాలు తీరుతాయనే నమ్మకం డీలర్లలో సన్నగిల్లుతోంది.

సకాలంలో అందని కమీషన్లు...

రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులు కూడా ప్రతినెల క్రమంగా అందడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. తాజాగా ఐదు నెలలకు సంబంధించిన కమీషన్లు ఇంకా జమ కాలేదని డీలర్లు వాపోతున్నారు. జిల్లాలో 423 మంది రేషన్ డీలర్లు ఉండగా, ఐదు నెలలకు ఒక్కొక్కరికి దాదాపు రూ. లక్ష వరకు చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. నెలవారిగా డబ్బులు అందకపోవడంతో డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో 'అమ్మ హస్తం' పథకం అమలు చేశారు. బియ్యంతో పాటు చక్కెర, పప్పులు, నూనె ఇతర సరుకులు మొత్తంగా 9 నిత్యావసర వస్తువులను పంపిణీ చేసేవారు. ఇది డీలర్లకు కాస్త లాభ సాటిగానే ఉండేది. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రేషన్ షాపులు బియ్యం పంపిణీకే పరిమితమయ్యాయి. దీంతో కమీషన్లు..

(తరువాయి 7లో)

గౌరవ వేతనం కోసం ఆందోళన....

రేషన్ డీలర్ల ముందు ఉన్న ప్రధాన సమస్య గౌరవ వేతనం. నెలకు రూ.30వేల గౌరవ వేత నాన్ని ఇవ్వాలని డీల్లరు దశాబ్దకాలానికి పైగా పోరాడుతున్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో గౌరవ వేతనం కల్పిస్తున్నందున తెలంగాణలోనూ గౌరవ వేతనం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ డిమాం డ్‌పై గత ప్రభుత్వం డీలర్లకు న్యాయం చేస్తామని ప్రకటించింది. కానీ పదేళ్లలో ఈ అంశంపై బీఆర్ఎస్ ప్రభుత్వం పెదవి విప్పలేదు. ఇదిలా ఉండగా 2023లో జరిగిన ఎన్నికల సమయంలో కాంగ్రెస్ డీలర్లకు గౌరవ వేతనం హామీ ఇచ్చినట్లు డీలర్లు చెబుతున్నారు. రూ.5వేల గౌరవ వేతనం కల్పిస్తామనే హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందు పరిచినట్లు అంటున్నారు. అయితే సంవత్సరం గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గౌరవవేతనం ఇవ్వాలని విన్న విస్తున్నారు. ఈ విషయమై రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసి, తమ డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు.

దేశ రక్షణకు ప్రాణత్యాగం చేసిన.. యాదవ సైనికుల త్యాగం మరువలేనిది

మందమర్రిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన యాదవ సైనికుల త్యాగం మరువలేనిదని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఇందు గార్డెన్స్‌లో మాజీ సైనికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ దేశం కోసం 114 యాదవ సైనికులు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. వారి సంస్మరణార్థం యాదవ రెజిమెంట్ స్థాపన కోసం బీహార్ నుంచి రేజాంగుల రజ్ కళశయాత్ర చేపట్టామన్నారు. ఈ యాత్ర 122 రోజులు చేపట్టామని, 28 రాష్ట్రాల్లో యాత్ర పూర్తయి తెలంగాణలో అడుగు పెట్టిందన్నారు. ఢిల్లీలో ఈ యాత్ర ముగుస్తుందన్నారు. అనంతరం మాజీ సైనికులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్ యాదవ్, లక్ష్మణ్, యశ్వంత్, రాజు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, మాజీ ఆర్మీసైనిక అధికారి కిరణ్‌కుమార్, సంతపు యాదవ్, సదానంద యాదవ్ పాల్గొన్నారు. పట్టణంలో మంగళవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



మాజీ సైనికులను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

యూరియా అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును సందర్శిస్తున్న రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : యూరియా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం మండలంలోని రాపన్‌పల్లి వద్ద ఉన్న అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టును సందర్శించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ చెక్ పోస్టులో పోలీసు సిబ్బందితో పాటు వ్యవసాయ, రెవెన్యూశాఖల సిబ్బంది 24గంటల పాటు నిరంతరం పకడ్బందీగా అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు చేస్తారన్నారు. ఈ చెక్‌పోస్టు వద్ద రెండు రోజుల క్రితం యూరియా అక్రమంగా రవాణా చేస్తున్న వారిని పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో వ్యవసాయ, పోలీసు, ఇతరశాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలను నియమించామని, జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. ఎరువుల కొరత తలెత్తకుండా రైతుల అవసరాలకు సరిపడ యూరియాను అందు బాటులో ఉంచామని, డిస్ట్రి బ్యూషన్ సెంటర్ల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. యూరియా ఎరువులు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వాహన తనిఖీ సమయంలో వివరాలు నమోదుచేసిన రిజిష్టర్‌ను పరిశీలించడంతో పాటు వాహనత నిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎరువుల నియం త్రణ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమరవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంక టేశ్వర్లు, చెన్నూరురూరల్ సీఐ బన్సీ లల్, ఎస్ఐరాజేందర్, అధికారులు, పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించం

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చత్రునాయక్

లక్షెట్టిపేట, ఆగస్టు,19 (ఆంధ్రజ్యోతి): రైతులను వ్యాపారులు ఇబ్బందులు పెడితే సహించేది లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చత్రునాయక్ అన్నారు. మంగళవారం లక్షెట్టిపేట పట్టణంలోని ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కటిన చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు తమ దగ్గర ఉన్న స్టాక్ వివరాలను నోటీసు బోర్డుపై ప్రతీరోజు పెట్టాలన్నారు. రైతులు కూడా వాళ్ల అవసరాలకు మాత్రమే ఎరువులను తీసు కోవాలని ఒకేసారి ఎక్కువ మోతాదులో తీసుకుంటే మిగిలిన రైతులు ఇబ్బంది పడుతారన్న విషయం గమనించాలన్నారు. ఇటిక్యాల, జెండవెంకటాపూర్, గుల్లకోట సహకారసంఘాల ద్వారా ఇప్పటికే సుమారు 300 టన్నుల యూరియాను పంపిణీ చేశామన్నారు. ఈతనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు గోపి, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్, ఉన్నారు.

దండేపల్లి: జిల్లాలోని యురియా కొరత లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నమని, ఇప్పటికే ఆగస్టు వరకు 19 మెట్రిక్ టన్నుల యురియా సప్లై చేశామని జిల్లా వ్యవసాయ అధికారిచత్రునాయక్ అన్నారు. మంగళవారం దండేపల్లి మండలం ముత్యంపేటలో ఫెర్టిలైజర్ షాప్‌ను తనిఖీ చేపట్టారు. అనంతరం రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ పాల్గొని రైతులు పంట యాజామాన్య పద్దతులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మన జిల్లాకు విడుత వారిగా యూరియాను సరఫరా చేస్తామని, గతంతో పోలిస్తే రెండు వేల మెట్రిక్ టన్నుల యూరియాఎక్కువగా సరఫర చేశామన్నారు. జిల్లాలోని యూరియ కొరత లేదని, రైతులకు సరిపడే యూరియాను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, రైతులు ఎవరు ఆందోళన చేదాల్సిల అవసరం లేదన్నారు. మొతాదు మించి యూరియాను ఎక్కువగా రైతులు వాడవద్దన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో మామిడిలో ప్రూనింగ్ కత్తిరింపులు మామిడిలో పూత పిందె రాలుడు సమస్యల నివారణ చర్యలపై వివరించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో వివిధ పంటలల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎరువుల యామాన్యంలో తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. నానో యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వినియోగించాలని, ఇది రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు.



గోదాంలను పరిశీలిస్తున్న అధికారులు

అనంతరం డ్రోన్ టెక్నాలజీ వాడకం దానికి సంబంధించి శిక్షణ కార్యక్రమంను గ్రామీణ ప్రాంత యవతకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆఫీసు అధికారి గోపి, ఏడిఏ అనిత, ఏవో అంజిత్ కుమార్, ఆయిల్ పామ్ కంపెనీ మేనేజర్ ఉదయ్ కుమార్, ఏఈవోలు నరేష్, సుజన్య, మౌనిక, శ్రీకన్య, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రీయింబర్‌మెంట్స్ లేక విద్యార్థుల ఇక్కట్లు

నస్పూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వ్యాప్తంగా స్కాలర్ షి ప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్స్ పెండింగ్‌లో ఉన్నందున చదువుకోలేక పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నరని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాగం శ్రీకాంత్ అన్నారు. నస్పూర్ పట్టణం సీసీసీ రాయల్ చౌరస్తా వద్దకు మంగళవారం ఎస్ఎఫ్ఐ సమరభేరి జీపు జాత చేరుకుంది. స్వాతంత్ర్య ప్రజాస్వామ్య సోషలిస్టు జెండా ఆవిష్కరణ చేసారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడారు. రియింబర్స్‌మెంట్స్, స్కాలర్ షిప్‌లు రాకపోవడం మూలంగా పేద విద్యర్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారన్నారు. కా ర్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఈదునూరి అభినవ్, జిల్లా గర్ల్స్ క న్వీనర్ రత్నవేణి, ప్రతిక్, ప్రదీప్, రాంచరణ్, రాజ్‌కుమార్, రాములు, ప్రకాష్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కి దూరంగా ఉండాలి

లక్షెట్టిపేట, ఆగస్టు,19 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కమ్యూనిటి ఎడ్యుకేటర్ సందీప్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ నిర్మూళన కోసం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితాలు నాషనం అవుతాయన్నారు. డ్రగ్స్ వాడిన వాటిని సరఫరా చేసిన చాలా నేరమని మన ప్రాంతంలో ఎవరైనా ఆలాంటి కార్యకలాపాలు చేస్తే వెంటనే 14446, 1908 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరిగేలా చర్యలు

● నస్పూర్ పోలీసు స్టేషన్ సందర్శించిన సీపీ



సీసీసీ పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ. ఇతర అధికారులు

నస్పూర్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా సూచించారు. నస్పూర్ పోలీసుస్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి స్టేషన్ భౌగోళిక పరిస్థితులు, సిబ్బంది పనితీరు, స్టేషన్ పరిధిలో నమోదయ్యే కేసుల వివరాలను తెలుసుకున్నారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. పోలీసుస్టేషన్ పెండింగ్ కేసులపై సీపీ ఆరాతీస్తూ, నేరాలనియంత్రణకు చర్యలను చేపట్టాలన్నారు. సీపీ మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా సజావుగా జరిగే విధంగా సూచనలు సలహాలను ఇచ్చారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాశ్, రూరల్ సీఐ అశోక్‌కుమార్, నస్పూర్ ఎస్ఐ ఉపేందర్‌రావు ఉన్నారు.

ఆశా వర్కర్ల ధర్నా



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

తాండూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తాండూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం చాలిచాలని వేతనాలు చెల్లిస్తుండడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా, సెప్టెంబరు 1న ఛలో హైద్రాబాద్ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు కవిత, రాజేశ్వరి, సావిత్రి, సునీత, భాగ్య, భారతి, అనురాధ, జయ, మల్లేశ్వరి, లక్ష్మీ, సంధ్యారాణి, మంజుల పాల్గొన్నారు.

నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

చెన్నూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గణేష్ మండపాల నిర్వహకులు విద్యుత్ అధికారులు సూచించిన నిబంధనలు పాటించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉత్తమ్ కోరారు. మంగళవారం సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వా హకులు విద్యుత్‌శాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాలకు వినియోగించే విద్యుత్ సరఫరాలో నాణ్యమైన కేబుళ్లను వాడాలన్నారు. అలాగే మండపాలను మెయిన్ లైన్‌ల కింద ఏర్పాటు చేయరాదన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్య ఉన్నా అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఏడీఈ బాలకృష్ణ, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోధనోపకరణాలతో బోధన చేయాలి



ఉపాధ్యాయుల ప్రదర్శనలు తిలకిస్తున్న డీఈవో యాదయ్య

కోటపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనోపకరణాలతో బోధించాలని డీఈవో యాదయ్య అన్నారు. మంగళ వారం మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఏర్పాటు చేసిన టీఎల్ ఎం మేళాకు ఆయన హాజరయ్యారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు అంశాల వారీగా ప్రదర్శించారు. తెలుగు, గణితం, సైన్స్, సాంఘీక శాస్త్రంలో తేలికగా బోధించే పలుచార్ట్‌లు, సామగ్రిని తయారుచేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను తిలకించిన డీఈవో ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ముగింపు సమావేశంలో ఆకట్టుకున్న పదిప్రదర్శనలను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అంతకుముందు ఈ మేళాను ఎంఈవో సీహెచ్ మొగిలి, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్, ఎంఈవో మొగిలి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొట్టెశంకర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాజశేఖర్, స్కూల్ కాంప్లెక్స్‌ల చైర్మన్‌లు కృష్ణ మూర్తి, సయింపు శ్రీనివాస్, న్యాయ నిర్ణేతలు రమేష్, పొగాకు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, శ్రీనివాస్, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం డీఈవో యాదయ్య విద్యార్థుల అభ్యాసన స్థాయి లను పరిశీలించారు. ఆరవతరగతిలో విద్యార్థులను పలు ప్రశ్నలుఅడిగి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. 6వతరగతిలో విద్యార్థులకు ఆంగ్ల పదాలు సరిగ్గా రావడం లేదని వీటిపై తర్ఫీ దునివ్వాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన జరపాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

జైపూర్ : పాఠశాలల్లోని తరగతి గదుల్లో బోధన ఉపకరణాలు ఉపయోగించి విద్యార్థులకు బోధించాలని సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి పేర్కొ న్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన టీఎల్ఎం మేళాను ఆయన ప్రారంభించారు. మం డలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొని బోధన ఉపక రణాలపై ప్రజంటేషన్ చేశారు. తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యానారాయణ, ఎస్ఐ శ్రీధర్, ఎంఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.